నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | శుక్రవారం 12 ఏప్రిల్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

అరునక్కనగర్‌లో కార్డన్ సెర్చ్

● పత్రాలు లేని వాహనాల పట్టివేత

అనుమతి పత్రాలు లేని వాహనాలు పట్టుకున్న పోలీసులు

శ్రీరాంపూర్, ఏప్రిల్ 11 : శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అరునక్కనగర్‌లో బుధవారం రాత్రి పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఎస్ఐ సంతోష్, సీఆర్‌పీఎఫ్ బలగాలు, పోలీసులు ఇంటింటా సోదాలు నిర్వహించారు. అనుమతి పత్రాలు లేని వాహనాలను పట్టుకొని జరిమానా విధించారు. ఎస్ఐ సంతోష్ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకే కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నామన్నారు. పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రజలు, యువకులు సహకరించాలని కోరారు. ప్రతి ఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకోవాలని కోరారు.

బీఆర్ఎస్‌లో చేరిన బీజేపీ నేతలు

పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న ఎమ్మెల్సీ విఠల్

బెజ్జూర్, ఏప్రిల్ 11 : మండలంలోని ముంజంపల్లిలో ఎమ్మెల్సీ దండె విఠల్ ఆధ్వర్యంలో గురువారం బీజేపీ జిల్లా అధికారి ప్రతినిధి డుబ్బుల జనార్దన్, ఆయన అనుచరులు 20 మంది బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్సీ దండె విఠల్ మండలంలో పర్యటించిన నేపథ్యంలో ముంజంపల్లిలోని తన నివాసంలో జనార్దన్, తన అనుచరులతో కలిసి బీఆర్ఎస్‌లో చేరగా, ఎమ్మెల్సీ విఠల్ వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు గెలుపుకోసం తమ వంతు కృషిచేస్తామని జనార్దన్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంఘాల జిల్లా అధ్యక్షుడు సోయం చిన్నయ్య, బీఆర్ఎస్ నాయకులు సామల రాజన్న, రాణా పాల్గొన్నారు.

ఘనంగా ఈద్-ఉల్-ఫితర్

● ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో భక్తిశ్రద్ధలతో వేడుకలు

● ఈద్గాలు, మసీదుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు ● పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్ : ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

మంచిర్యాలలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు

కుమ్రం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో ఈద్-ఉల్-ఫితర్‌ను ముస్లిం సోదరులు గురువారం అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈద్గాలు, మసీదుల వద్ద సామూహిక ప్రార్థనలు చేయగా, మత పెద్దలు సందేశాలు వినిపించారు. పలుచోట్ల ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని ముస్లింలను ఆలింగనం చేసుకొని పండుగ శుభాకాంక్షలు తెలిపారు. పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

బెజ్జూర్ : శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్సీ దండె విఠల్

జన్నారం కవ్వాల్ ఫజల్ ఖాన్ ఇంట్లో రంజాన్ వేడుకల్లో పాల్గొన్న ఖానాపూర్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి భూక్య జాన్సన్‌నాయక్

'ఎత్తిపోతల'కు బ్రేక్

గూడెం ఎత్తిపోతల పథకం పంప్‌హౌస్

● గూడెం పంప్‌హౌస్ నుంచి నిలిచిన నీటి సరఫరా

● ఆలస్యంగా వరి సాగు చేసిన రైతులు నష్టపోయే ప్రమాదం

దండేపల్లి, ఏప్రిల్11 : గూడెం ఎత్తిపోతల పథకం నుంచి నీటి సరఫరా నిలిపివేయగా, ఆలస్యంగా వరి సాగు చేసిన రైతాంగం తీవ్రంగా నష్టపోయే ప్రమాదం నెలకొంది. యాసంగిలో గూడెం ఎత్తిపోతల నుంచి సుమారు 15,600 ఎకరాలకు సాగు నీరందించాలని అధికారులు నిర్ణయించారు. ఆయకట్టు పరిధిలోని డీ-30 నుంచి డీ-42 (కాలువలు) వరకు జనవరి 6వ తేదీ నుంచి నిరంతరాయంగా నీరు సరఫరా చేశారు. గోదావరిలో నీరు తగ్గడంతో ఈ నెల 3న నీటి సరఫరా నిలిపివేశారు. వరి గొలక దశలో ఉందని, పంటలు ఎండిపోయే ప్రమాదముందని రైతులు అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లడంతో ఈ నెల 7,8,9 తేదీల వరకు నీటిని అందించి.. ఆ తర్వాత ఆపేశారు.

ఆందోళనలో అన్నదాతలు

అనుకున్న సమయంలో సాగు చేసిన రైతులకు కొన్ని చోట్ల పంట కోతకు వచ్చింది. మరి కొన్ని చోట్ల కోతలు కూడా ప్రారంభమయ్యాయి. అయితే, ఆలస్యంగా సాగు చేసిన వరి గొలక దశలో ఉంది. వీటికి ఒకటీ... రెండు తడులు అవసరముంది. లిఫ్ట్ నీటిని నిలిపివేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి నీరు సరఫరా చేయాలని వేడుకుంటున్నారు.

సర్కారు ఆదేశాల మేరకే..

రాష్ట్రంలో ఎండలు మండిపోతుండడంతో సాగు నీటి కంటే.. తాగునీటికి ప్రాధాన్యమివ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. గూడెం ఎత్తిపోతల ద్వారా అనుకున్న దాని కంటే ఎక్కువే సాగునీటిని అందించడం జరిగిందని అధికారులు అంటున్నారు. ఎల్లంపెల్లి బ్యాక్ వాటర్ నుంచి గూడెం ఎత్తిపోతల ద్వారా జనవరి 6 నుంచి మార్చి 31 వరకు 1.5 టీఎంసీల నీరు మాత్రమే అందించాలని అధికారులు నిర్ణయించారు. కానీ అనుకున్నదానికంటే ఎక్కువే నీటిని అందించామని వారు చెబుతున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకే నీటిని నిలిపేశామని వారు పేర్కొంటున్నారు.

కాంగ్రెస్‌కు కోడ్ వర్తించదా?

రంజాన్ వేడుకల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

రంజాన్ వేడుకలకు హాజరైన ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వంశీ

● రంజాన్ వేడుకలను రాజకీయ వేదికగా మార్చిన ఆ పార్టీ నేతలు

● ఈద్గాలోకి వచ్చి ఎమ్మెల్యే పీఎస్సార్ మాట్లాడడంపై అభ్యంతరాలు

● 'హస్తం'ను గెలిపించాలని మైక్‌లో అనౌన్స్ చేయడంపై ముస్లిం సోదరుల ఆగ్రహం

● అనుమతి లేకుండా ఈద్గాలో డ్రోన్ తిప్పించిన ఎంపీ అభ్యర్థి వంశీ

● ఇది ఎన్నికల నియమావళిని ఉల్లంఘించడమే : మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాల, ఏప్రిల్ 11 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కాంగ్రెస్ పార్టీ నేతలు పార్లమెంట్ ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తూ.. ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనడానికి గురువారం మంచిర్యాలలో జరిగిన ఘటనే ఇందుకు సజీవ సాక్ష్యంగా నిలుస్తున్నది. మంచిర్యాల జిల్లా ర్యాలీ సమీపంలోని ఈద్గాలో ఎప్పటిలాగే ఈ ఏడాది ముస్లిం సోదరులు రంజాన్ వేడుకలు నిర్వహించారు. నిష్టతో ఉపవాసాలు చేసి, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రాజకీయ పార్టీలకు సంబంధం లేకుండా ముస్లిం సోదరులు నిర్వహించే ఈ వేడుకలో కాంగ్రెస్ నేతలు ఓట్లు అభ్యర్థించారు. ఈద్గాలోకి వెళ్లడమేగాక వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి వంశీ సాబ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఓ వ్యక్తి ప్రార్థన చేసే మైక్‌లో అనౌన్స్ చేశారు. అలాగే మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు సైతం అదే మైక్ దగ్గరకు వెళ్లి ముస్లిం సోదరులనుద్దేశించి మాట్లాడారు. కొన్ని హామీలు సైతం ఇచ్చారు. ఇక్కడి వరకు బాగానే ఉన్నా.. కాంగ్రెస్‌కు ఓటు వేయాలని పిలుపునివ్వడంపై ముస్లిం సోదరులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతున్నప్పుడు, ఆయన ప్రసంగం అయిపోయాక కొందరు ముస్లిం సోదరులు చప్పట్లు కొట్టగా, అక్కడున్న మతపెద్ద వెంటనే ఖండించారు. ఈద్గా లోపల చప్పట్లు కొట్టడం సరికాదంటూ చురకలు అంటించారు. కార్యక్రమం అనంతరం కొందరు ముస్లింలు కూడా ఈద్గా లోపలికి వచ్చి ఎమ్మెల్యే మాట్లాడడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ముస్లిం సోదరులు అత్యంత పవిత్రంగా భావించే రంజాన్ వేడుకలను రాజకీయ వేదికగా మార్చి, ఓట్లు అభ్యర్థించడమమేమిటని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి వంశీ సైతం పాల్గొన్నారు.

ఈద్గా లోపల ఎగురుతున్న డ్రోన్

అనుమతి లేకుండా డ్రోన్..

పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో ఏదైనా మీటింగ్ పెట్టుకోవాలంటే ఎన్నికల కమిషన్ అనుమతి తీసుకోవాలి. అలాంటిది రంజాన్ పండుగ వేడుకలో ఓట్లు అభ్యర్థించడం.. ఎన్నికల కోడ్ ఉల్లంఘనలోకి రాదా అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. పైగా పర్మిషన్ లేకుండా ఏ కార్యక్రమంలోనూ డ్రోన్ ఉపయోగించ వద్దని ఇటీవల పోలీస్ కమిషనర్ ఆదేశాలు కూడా ఇచ్చారు. అవేవీ పట్టించుకోకుండా కాంగ్రెస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీ ఈద్గాలో ప్రార్థనలు జరుగుతున్న సమయంలో డ్రోన్‌తో వీడియోలు, ఫొటోలు తీయించారు. డ్రోన్ వాడకానికి సంబంధించి ఎవ్వరూ ముందస్తు అనుమతులు తీసుకోలేదని రామగుండం సీపీ కార్యాలయం, మంచిర్యాల పోలీసులు తెలిపారు. ఇలా యథేచ్ఛగా కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తున్నప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఇది ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించడమే..

35 ఏండ్లుగా రంజాన్ వేడుకల్లో పాల్గొంటున్నా. ముస్లిం సోదరులు అత్యంత పవిత్రంగా భావించే రంజాన్ వేడుకల్లో ఏనాడూ రాజకీయాలు చేయలేదు. ముస్లింల మనోభావాలు దెబ్బతినేలా కాంగ్రెస్ వ్యవహరించడం సరికాదు. ఈద్గా లోపలికి వెళ్లి ఓట్లు అడగడం ఎన్నికల నియమావళిని ఉల్లంఘించడమే అవుతుంది. దీనిపై చర్యలు తీసుకోవాలని ఎనికల సంఘాన్ని డిమాండ్ చేస్తున్నా. నేను ఎమ్మెల్యేగా మంచిర్యాలలో ముస్లిం సోదరుల అభ్యున్నతికి కృషి చేశా. రానున్న రోజుల్లో మైనార్టీ సంక్షేమానికి కట్టుబడి ఉంటాను.

- దివాకర్‌రావు, మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే

సాయిసుమ (ఫైల్)

సెల్‌ఫోన్ కొనివ్వలేదని డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్య

జైపూర్, ఏప్రిల్ 11 : సెల్‌ఫోన్ కొనివ్వలేదని డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన జైపూర్ మండలం వేలాలలో గురువారం జరిగింది. ఎస్ఐ నాగరాజు తెలిపిన కథనం ప్రకారం.. వేలాల గ్రామానికి చెందిన ప్యాగ స్వామి, సమ్మక్క దంపతుల కుమార్తె సాయిసుమ (18) మంచిర్యాలలోని ఓ కాలేజీలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నది. తన సెల్‌ఫోన్ పగిలిపోయిందని, మరో సెల్‌ఫోన్ కొనివ్వాలని తల్లితో గొడవ పడింది. పత్తి అమ్మిన తర్వాత కొనిస్తామని చెప్పిన సమ్మక్క.. భర్త స్వామితో కలిసి పొలం పనులకు వెళ్లిపోయింది. వీరి కుమారుడు ఇంటి తలుపులు వేసి ఉండడంతో కిటికి లోంచి చూడగా సాయిసుమ ఉరి తాడుకు వేళాడుతూ నిర్జీవంగా కనిపించింది. వెంటనే తల్లితండ్రులకు సమాచారం అందించాడు. ఆపై పోలీసులు అక్కడికి చేరుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్ఏ-2 పరీక్షలకు అన్ని ఏర్పాట్లు

డీఈవో యాదయ్య

మంచిర్యాల టౌన్, ఏప్రిల్ 11 : ఈ నెల 15 నుంచి 22వ తేదీ వరకు నిర్వహించే ఎస్ఏ-2 పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్ యాదయ్య ఓ ప్రకటనలో తెలిపారు. ఒకటి నుంచి ఐదో తరగతి ప్రశ్నా పత్రాలను మండల విద్యాధికారుల సమక్షంలో అన్ని పాఠశాలలకు పంపిణీ చేయడం జరిగిందని, ఆరు నుంచి తొమ్మిదో తరగతి ప్రశ్నా పత్రాలు ఆయా మండల కేంద్రాల్లోని ఎమ్మార్సీ కస్టోడియన్ హైస్కూల్‌లో అందుబాటులో ఉన్నాయని, అన్ని పాఠశాలల హెచ్ఎంలు టైం టేబుల్‌ను అనుసరించి ప్రశ్నా పత్రాలను తీసుకెళ్లాలని కోరారు. ప్రశ్న పత్రాల లీకేజీకి పాల్పడినా, మాస్ కాపీయింగ్‌కు పాల్పడినా ఉపాధ్యాయులు, పాఠశాలలపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ నెల 23వ తేదీ వరకు ప్రశ్నాపత్రాల మూల్యాంకనం పూర్తి చేసి విద్యార్థులందరికీ తప్పనిసరిగా ప్రోగ్రెస్ కార్డులు అందజేయాలని, ప్రశ్నా పత్రాలకు సంబంధించి మరింత సమాచారం కోసం డీసీఈబీ సహాయ కార్యదర్శి కుమార స్వామి(94900 92767)ని సంప్రదించవచ్చని తెలిపారు.

పూలేకు ఘన నివాళి

పూలే దంపతులకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ దండె విఠల్

కేటీఆర్‌తో కలిసి జ్యోతిబాపూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, ఏప్రిల్ 11 : హైదరాబాద్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన జ్యోతిబాపూలే జయంతి వేడుకల్లో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో కలిసి ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు.

పూలే ఆశయ సాధనకు కృషి చేయాలి

బెజ్జూర్, ఏప్రిల్ 11 : సంఘ సంస్కర్త, పూలే దంపతుల ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన జ్యోతిబాపూలే జయంతిలో మాలీ సంఘ నాయకులతో కలిసి పాల్గొన్నారు. పూలే దంపతుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సోయం చిన్నయ్య, సామల రాజన్న, చిప్పకుర్తి దేవాజీ, రౌతు లచ్చన్న, మేర్గు రమేశ్, మాలీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

బోరు బాగైంది

నమస్తే ఎఫెక్ట్

జైపూర్, ఏప్రిల్ 11: ఇందారం గ్రామంలోని శివాలయం వీధిలోగల బోరు 15 రోజుల క్రితం చెడిపోయింది. దీంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో గురువారం 'నమస్తే తెలంగాణ'లో 'బోరు బాగు చేయించండి' పేరిట కథనం ప్రచురితమైంది. ఇందుకు అధికారులు స్పందించారు. ఈ మేరకు బోరుకు హ్యాండిల్ బిగించారు. నీటి సమస్యకు పరిష్కారం చూపిన 'నమస్తే'కు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

బోరుకు హ్యాండిల్ బిగించడంతో చూపిస్తున్న వృద్ధుడు